
'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

- ఎమ్.వి.వి.సత్యనారాయణ

# కార్నర్

నాలుక పీక్కుపోతోంది.

పంతొమ్మిదొందల తొంభైనాలుగు, కొత్త ముఖ్యమంత్రి పదవీ ప్రమాణ స్వీకారం చేసిచెయ్యగానే జానపద కథానాయకుడి లాగా మద్య నిషేధం అమలు చేసేస్తే నాలాంటి మందోపభాగ్యుల గతేం కావాలి! ఇంతకాలంపాటూ పీపాలకు పీపాలు పట్టేసి ఇంత అకస్మాత్తుగా గొంతు కట్టేస్తే నరాలు ఏంకావాలి! మందు మీద ఆధారపడి కబాబ్స్, పకోడీలూ, పలావులూ, చేపల వేపుళ్లూ అమ్ముకుని బతికే జీవులూ వాళ్ల కుటుంబాలూ ఏం కావాలి!



సరే... సరే... ఇప్పుడు నాకు మందు దొరికెడి భాగ్యమెట్లు! నా సహచర మందు పీకుడుగాడు సుందరరావుకు ఫోన్ చేశాను.

రోలు మద్దెల సామెత చెప్పి తాను మద్దెల స్థానం ఆక్రమించుకున్నాడు సుందరరావు. సామెతొద్దని సరుకు కావాలని అడిగాడు.

"మన ఆర్మీ భద్రగాడు..."

"ఎప్పుడో అడిగేశాను. ఈనెలకొచ్చిన రేషనంతా ఎప్పుడో పీకేశాడట! వాడు కూడా ఒరిస్సా వెళ్దామంటున్నాడు."

"ఇంకేం! అదే మంచిది. రాయగడ వెళ్దాం!"

బాగానే వుందనిపించింది. రాయగడ ఏమంత దూరం! మూడు గంటల కారు ప్రయాణం. తిరుగు టపాలో బోలెడంత మందుగుండు సామగ్రి తెచ్చుకోవచ్చు.

ఇంకేం, ముగ్గురు మందు జీవులం కారులో పెట్రోలు కొట్టించుకుని పొట్టలో పెట్రోలుకోసం ఒక దుర్ముహూర్తాన బయల్దేరాం.

దారిపొడుగంతా తాగుడు కుంతలే! వెళ్లేటప్పుడు మందు మజా లేకపోతే ఎలా! పాతిక వరకూ దగ్గు మందు (సిరప్) బాటిల్స్ సంపాదించుకుని మరీ బయల్దేరాం. పార్వతీపురం పొలిమేరలకే వాటిని వూదేశాం- వంతుల మీద మరీనూ. ఫుల్‌బాటిల్ ఎత్తేసే మందు వీరుడికి ఎలెవెన్ పర్సంట్ ఆల్కహాలు ఏ మూలకి!

మిలటరీలో వున్నంతసేపూ తాగుతూనే గడిపాడు భద్రం. బయటికొచ్చాక కూడా అతడు తన పద్ధతి మార్చుకోలేదు. అవసరమూ లేకపోయింది. పిల్లలు పెళ్ళిళ్ళయ్యి దూరదూరాల్లో స్థిరపడిపోయారు. ఇతడి సౌలభ్యం కోసం కాబోలు తన స్థానంలో మందును ప్రవేశపెట్టి భార్య కాలం చేసింది.

అందువల్ల మందు జీవితంలోకి అతడు పూర్తిగా ఫిరాయించాడు.

భద్రం రాయగడ చేరుకోగానే నా కారులోంచి దూకి ఒరియా భాషలో రాసి వున్నప్పటికీ శిక్షణ పొందిన కుక్కలలె వైన్‌షాప్ గుర్తుపట్టి దాని చుట్టూ గిరికీలు కొట్టాడు. అది వేళకాని వేళలో మూసి వుంది.

భద్రం ఒక్కడూ ఆ మాదిరిగా బయటపడిపోయాడు కాని నాకూ సుందర రావుకూ అతడికంటె కూడా ఎక్కువ ఆరాటంగా వుంది.

ఆ షాపు సంబంధీకులు చుట్టుప్రక్కల కూడా లేరని నిర్ధారించుకున్నవాడై ఖిన్నుడై గోడకి కొట్టిన బంతే అయ్యాడు భద్రం.

"ఏమయ్యింది! షాప్ ఎందుకు తెరవలేదు!" అడిగాను.

"మందు షాపుల పెద్దబాబు చచ్చిపోయాడట!" అన్నాడు భద్రం.

"సిండికేట్ పెద్దా!"

"రఘునాథ పాణిగ్రాహి. రేపు మూస్తారో లేదో తెలియాలి!..." కారుకు చేరగిలపడిపోయాడు భద్రం.

నాకూ సుందరరావుకూ నరాల మోత. మందెక్కడ దొరుకుతుంది? ఇంత మందీ భాగ్యులమా మేము! రాయగడలో మద్యం వ్యాపారులు మరీ అంత ఘోరంగా మడికట్టుక్కూర్చుంటారా!

"పదండి. రాయగడంతా తిరుగుదాం! మందుకోసం ఎన్ని రోజులు ఇక్కడ ఆగుతాం!"

కారు బయల్దేరతీశాను. దారిపొడుగంతా బీదాబిక్కీ జనం. బాగా వెనక పడిన వూరు. తెలుగువాళ్లు ఎక్కువగా స్థిరపడిన ఒరిస్సా టవున్స్‌లో బరంపురం తర్వాత రాయగడే!

"రోడ్లూ, ప్రజలూ- ఎక్కడా హుషారు లేదే!"అన్నాను.

దుమ్ముకొట్టుకుపోయిన రోడ్లు, ఇళ్ల అరుగులూ, గోడలూ, అక్కడికక్కడే దుమ్ములో కూరుకుపోయిన దుకాణాలు- అవీ చిన్నచిన్నవి. ఇంచుమించు అందరూ ఏదో ఒకటి నములుతూనే వున్నారు. ఎర్రటి వుమ్ముల మయం. రోడ్లూ, ఇళ్ల అరుగులూ!

"అవిగో...ఆ అలవాట్లే కారణం. మద్యం. పాన్ మసాలా, రకరకాల మాదక ద్రవ్యాలూ. ఆహారం కంటె ఆహార సంపాదనకంటె ఒరిస్సా సోదరులు వీటికిచ్చే ప్రాధాన్యమెక్కువ"అన్నాడు సుందరరావు.

"ఇందుకు నెగెటివ్‌గా మన ఆంధ్రాని తీసుకుందాం!" నిజాయితీ భద్రం గొంతులో ధ్వనిస్తోంది. "మద్యం ఎత్తేశాక కూలీనాలీ జనం, ఉద్యోగ వర్గాలూ బాగుపడ్డారు. మందు దరిద్రం వదిలాక బీదాబిక్కీ మొహాల్లోకి కళాకాంతులొచ్చాయి. తమ బిడ్డల అవసరాలు తీరుస్తున్నారు."

"శభాష్!" సుందరరావు అతడి భుజం తట్టాడు.

నేను కూడా నవ్వి చప్పట్లుకొట్టి అభినందించాను.

రాయగడ మొత్తం తిరిగాం కానీ మద్యం కలికానికి కూడా దొరకలేదు. రాత్రి తొమ్మిదింటికి నీరసంగా హోటల్ చేరుకున్నాం. భద్రం మళ్లీ దగ్గు సిరప్ సంపాదించాడు.

మందు వాసన కూడా లేక మట్టి తిన్న పాముల్లాగా ముగ్గురం మూడు బెడ్స్ మీద పడిపోయి అఘోరిస్తున్నాం. రాయగడ రోడ్లులాగా మా మెదళ్లు కూడా దుమ్ముకొట్టుకుపోయి వున్నాయి.

రూంబాయ్ గుడాకు దంతాలకూ నాలుకకూ మధ్య చొప్పించుకుంటూ గదిలోకి ఎంట్రీ యిచ్చాడు.

ఆపద్బాంధవుడు! తపస్సు పాడుచేసే దేవ వేశ్యలాగా కాకుండా మా కష్టం తీర్చడానికి దిగివచ్చిన దేవుడిలాగా తోచాడు.

"ఏం బాబూ! మందు దొరుకుతుందా!" చివరి ప్రయత్నంగా అడిగాడు సుందర్రావు.

నేనూ భద్రం కేవలం ప్రేక్షకుల మయ్యాం.

మా రోగ నిర్ధారణ తన చేతిలో వున్నట్టు అశ్వనీ దేవత మాదిరి చిలక నవ్వులు రువ్వాడు రూంబాయ్.

"సార్! పాడిని పంపుతాను! అతడితో మాట్లాడండి!"

"పాడా! ఆవుపాడా! గేదె పాడా! దేవతా పాడి మద్యం దొరుకుతుందా!"

"కంగారేముంది! మాట్లాడండి!"

డింగ్‌మంటూ మోహిని దేవతలాగా పాడి ప్రత్యక్షమయ్యాడు. అతడి ప్రక్కనే పాడెమ్మకూడా వుంది. మా ముగ్గురికీ సౌండ్ లేదు.

"మా కళ్లు పచ్చబడ్డాయి కదూ! నాకెంత వాటా వుందో నా భార్యకూ బిగినీస్‌లో అంతే వాటా వుంది" అన్నాడు పాడి.

గొణిగాను. సణిగాను. అందువల్లే కాబోలు పాడి స్పష్టంగా, "మా బిగినీస్‌లో మా యింటోల్లదే సురుకైన పాత్తర. ఎక్కడ మందుంటే అక్కడికల్లా దూసుకుపోతుంది" అన్నాడు.

"అంటే ఆవిడ సంపాదన ఆవిడదేనా!"

"డౌటే లేదు!"

"ఆల్ రైట్! మాకు మూడు ఫుల్స్ కావాలి!"

"ఈరోజే అయితే మటుకు వంద ఎక్స్‌ట్రా!"

"అసలు రేటెంత!'"

"బ్రాండ్!"

చెప్పాను.

"రెండూయాభై! ప్లాస్టిక్ కంటెయినర్!"

ఎగిరి గంతేశాం. వెయ్యియాభై అందించాను.

ఆంధ్రాలో ఆరొందలు పెట్టినా చీప్‌లిక్కర్ కూడా దొరకడంలేదు.

పై మూడొందలూ భార్యాభర్తలు చెరో నూటయాభై చొప్పున పంచుకున్నారు. మూడు బాటిల్సూ గంటలో వచ్చిపడ్డాయి.

* * *

హోటల్ గదిలో చేరి మూడో రోజు. మా మొహాలు తాజా పూరీల్లాగా పొంగిపోయాయి. ఒక్కొక్కడూ నాలుగేసి బాటిల్సు ఎత్తేశాం. అన్నీ హోటల్ గదిలోనే. అదే ప్రపంచం. తినడం తాగడం.

రాయగడ మాకు దివ్య లోకమై కూర్చుంది. ఇంతకంటె గొప్పవా మా పని పాటలూ, సంపాదనా!

మొదటి రాత్రి తర్వాత పాడీ అండ్‌కో తిరిగి కనిపించలేదు. వాళ్ల బ్లాక్ మార్కెట్‌తో అవసరం లేకుండాపోయింది. దిగిన మర్నాడే మాక్కావాల్సిన షాపులు తెరచారు.

కాని గంటగంటకి టచ్‌లో వుంటున్నాడు పాడి. పాడెమ్మ కూడా డిటో. మేము తిరిగి వెళ్లిపోయే దుష్టఘడియలు దాపరించాయి. మా ముగ్గురికోసం ఆంధ్రా అంతటా వెతుక్కుంటున్నారు మా వాళ్లు.

పాడి వచ్చాడు కాదు కాదు వాలిపోయాడు. అతడి వైపు చిరాకుగా చూడాలనిపించింది కాని అతడి చేతిలో సరికొత్త అమృతం బాటిలుంది.

"మీలో ఎవరైనా ఈ సరుకు తాగారా!"

చిత్రంగా వుంది సీసా. 'ఫుల్ స్పిరిట్!' అట బాటిల్ పేరు. పేరున్న సంస్థ రూపొందించిన బ్లెండెడ్ విస్కీ.

పరిహాసమో విజయగర్వమో మిళాయించి ఒక నవ్వు నవ్వాడు పాడి. తర్వాత అదే రేంజ్‌లో, "ఇలాంటి బాటిల్ మీకెక్కడ దొరుకుతుంది? ఒరిస్సాలో సర్వీస్ పీపుల్‌కి మాత్రమే ఇస్తారు' అన్నాడు.

"అదేమిటి!"

"అవునండి. మార్కెట్లో సప్లయ్‌కి పెట్టలేదు."

అనుమానంగా చూశాడు భద్రం. మిలటరీ సరుకు అతడికి తెలియనిది లేదు. రుచి చూడనిది లేదు. అతడి మీద రకరకాలుగా ప్రశ్నలు సంధించి తొణుకూ బెణుకూ లేని సమాధానాలు పాడినుండి తన ఖాతాలోకి వేసుకున్నాడు. దరిమిలా తదనుగుణ్యంగా నోరావులించాడు.

"మరినిన్నామొన్నా ఈ సరుకు తీసుకురాలేదేం!" అడిగాడు భద్రం, బాటిల్ ఎడాపెడా చూసి. తనివి తీరక తిరగేసి, మరగేసి.

"దొరకవయ్యా!"అన్నాడు పాడి.

"ఇప్పుడెలా దొరికింది!" బాణం సంధించాడు భద్రం.

"మిమ్మల్ని నమ్ముకుని కాస్త ఎక్కువే పెట్టి సంపాదించాను!" బూమరాంగ్ తిరిగి భద్రానికే తగిలింది. పాడిని గెలవడం కష్టం! మా ముగ్గురికీ వాడొక్కడే సమాధానం.

"వెయ్యి. స్కాచ్ కంటె గొప్పగా వుంటుంది!"

చెప్పొద్దూ! నాకే నోరూరుతోంది. మిగతా వాళ్ల పరిస్థితీ ఇంచుమించు 'వూరుడు స్థాయిలో' తల మునకలవుతోంది.

ఇంకేముంది? ప్రయాణం వాయిదా! మందు ముందు ఇంకేమిటి వుంటుంది?

ఏటిఎం కార్డ్‌కి పని కల్పించాను. భద్రం కూడా డిటో... సుందరరావు ఒక్కడే భారీ బందోబస్తు మీదొచ్చాడు.

నిజంగానే స్కాచ్ విస్కీ కంటె గొప్పగా వుంది కొత్త విస్కీ. ఒక్క బాటిలు అందరినీ తిప్పి తిప్పి కొట్టింది.



మా అప్పలకొండ బావ 'రా'కొడతాడు. ఫుల్‌బాటిల్ సైతం దాసోహం అనవలసిందే! అసలు ఆ రికార్డ్ మీదే ఎమ్మెల్యే టికెట్ సంపాదించాడని ప్రతిపక్షం అల్లరి చేసింది కూడా!

"ఈ ఒక్క దానితోనే సరిపెడదాం! తలో నాలుగు బాటిల్స్ కారులో దాచుకుని తీసుకుపోదాం!" అన్నాను.

"మధ్యలో తనిఖీ జరిగితేనో!" నవ్వాడు సుందరరావు.

"అప్పుడు చూసుకుందాం! ముందీ సరుకు నొక్కెయ్యాలి!" అన్నాడు భద్రం.

పాడికి పదిహేనువేలు సమర్పించుకుని పదిహేను బాటిల్స్ సొంతం చేసుకున్నాం. కారులో సీట్ల క్రింద సర్దేశాం. బయల్దేరే ముందు దిగబడ్డాడు పాడి. ఒక్కడూ!

"పాడీ! రాష్ట్ర సరిహద్దు దాటి వచ్చాం. విందు భోజనం లాంటి మందు అందించావు" అన్నాను అతడితో కరచాలనం చేస్తూ.

సుందర్రావూ భద్రం అయితే అతడ్ని పాడెమ్మ అనుకున్నారో ఏమిటో కావలించుకుని నలిపేసి ముద్దులు కురిపించినంత పనిచేశారు.

పాడి మొహం విషాదం పులుముకొంది.

"ఏమయ్యింది!" అడిగి మరో పొరపాటు చేశాను.

"మనకి సరుకు ఇచ్చిన వాడి ఇంటిమీద రెయిడింగ్ జరిగింది. వాడు నా పేరు చెప్పాడు. నా చేతికి మూడువేలు తగులుకుంది!" గొల్లుమన్నాడు ఒరియా వ్యాపారి.

మా ఆనంద విలాసాలకిది ముక్తాయింపు. శభాష్! పాడి మమ్మల్ని బాగా లోకువ కట్టాడు.

"ఎలా! ఎవరి దగ్గరా డబ్బులేదే!" అన్నాడు భద్రం.

"పోనీ... రెండు బాటిల్సు వదిలెపెట్టెయ్యండి!" సూచించాడు పాడి.

బాటిల్స్ ఎందుకొదుల్తాం! నెత్తిమీద దరిద్రం తాండవిస్తూంటే. డబ్బే చెల్లించుకున్నాం వాడికి!

* * *

మద్యం మహా చుక్క దొరకని ఆంధ్రాలో విలయ తాండవం చేస్తున్న విపత్కర పరిస్థితిలో, మందు బాబుల మూతులెండిపోతున్న తరుణంలో మా అప్పలకొండ బావ రాష్ట్ర మంత్రి పదవి స్వీకరించాక తొలిసారిగా మా యింటికి వస్తున్నాడంటే ఆ వార్త నన్ను విషాదంతో ఉక్కిరి బిక్కిరి చెయ్యాలి. కాని నేను గొప్ప ధీమాతో తలమునకలై వున్నాను. కారణం భూమిలో పాతిపెట్టిన రాయగడ సరుకుంది!

మా అప్పలకొండ బావ 'రా' కొడతాడు. ఫుల్‌బాటిల్ సైతం దాసోహం అనవలసిందే! అసలు ఆ రికార్డ్ మీదే ఎమ్మెల్యే టికెట్ సంపాదించాడని ప్రతిపక్షం అల్లరి చేసింది కూడా!

అర్ధరాత్రి మిడసరి లగ్నంలాగా దిగబడ్డాడు మంత్రి బావ. ఒక్కడూ అని పొరపాటు అంచనా వేసుకున్నాను. అతడితోబాటు ముగ్గురు దిగబడ్డారు. వాళ్లే అతడి సైన్యం. పాతర లోంచి తీసిన మందు బాటిల్స్ చాలవే!

అప్పటికప్పుడు భద్రానికీ, సుందరరావుకూ వసుదేవుడి రేంజ్‌లో పాదాభివందనాలు చేసి వాళ్ల బాటిల్స్ కూడా సంపాదించాను.

ద్రవం గ్లాసులలో మిలమిల లాడేటప్పటికి రాత్రి ఒంటి గంటయ్యి పూడ్చింది. కోడి జాతికి సంబంధించి అయిదూ, చేపకి సంబంధించి మూడూ, మేకకి సంబంధించి రెండూ అయిటమ్స్ డైనింగ్ టేబుల్సు మీద సర్దుకున్నాయి.

"చూపులకు సుందరంగా వుంది బావా మందు!" అప్పలకొండ మగతగా వూగి పోవడానికి ఎలాంటి ఆలస్యం చెయ్యలేదు.

గర్వంతో పొంగిపోయాను.

మద్యం ఏరులైపారుతోన్న ఇప్పటి పరిస్థితిలో అప్పటి నా సంతోషం ఆ స్థితి ఎవ్వరూ వూహించలేరు.

ఛీర్స్ కొట్టుకున్నాం. గ్లాసులెత్తాం. అప్పలకొండ బావకి నోరు చెడిపోయినట్టుంది. తుప్పుమంటూ ద్రవమంతా వుమ్మేశాడు. బల్లమీది అయిటమ్స్‌మీద వర్షపు జల్లులాగా పడింది వుమ్మి.

ఇంచుమించు అదే స్థాయిలో అందరం వుమ్మేశాం.

బావ వెంట వచ్చిన కత్తి యోధుడొకడు అసహ్యంగా వాంతి కూడా చేసుకుని మాలో ఒకరిద్దరికి మార్గదర్శకత్వం వహించాడు.

దరిమిలా "ఎవడ్రా ఈ సరుకిచ్చింది!"అంటూనే మంత్రి బావ నా ఒంటి మీద పడేలాగా వాంతి కూడా చేసుకున్నాడు.

కిరసనాయిలూ కుళ్లిపోయిన పచ్చి రొయ్యలూ తమాషాగా మిళాయించినప్పటికీ అటువంటి గుబాళింపు రప్పించడం అసాధ్యం.

చచ్చీ చెడి 'పాడి' ఎపిసోడ్ టీవీ సీరియల్ ఎపిసోడ్ లాగా వివరించుకొచ్చాను.

"అక్కడ మాచేత మంచి సరుకు తాగించి చెత్త సరుకు మీ నెత్తినెత్తాడు!"అన్నాడు మంత్రి బావ.

"ఇదస్సలు మద్యం కానేకాదుసార్!" కత్తి యోధుడు కితాబిచ్చాడు.

"పాడి"ని కావలించుకుని ముద్దులు పెట్టుకున్నంత పని చేసిన మా బృందం వెకిలి చేష్టలూ నా కరచాలనం సీనూ గుర్తొచ్చాయి.

ఇప్పుడేది దారి! ఈ సంకట స్థితిలోంచి ఎలా బైటపడాలి! మందు సంగతెలా!

బావ మంత్రి స్థాయిలో గూండారంకెలు మొదలుపెట్టాడు. ★